# ప్రభావశీల వేదిక... షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్!!

**షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్(ఎస్‌సీవో)... 2001, జూన్ 15న చైనాలోని షాంఘై నగరంలో ఏర్పాటైంది. మొదట్లో ఇది "షాంఘై-5"గా ఉండేది. ఉజ్జెకిస్థాన్‌ను కూడా చేర్చుకోవడంతో పేరు మార్చుకొని షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్‌గా అవతరించింది. వాస్తవానికి ప్రచ్ఛన్నయుద్ధం ముగిసిన నేపథ్యంలో.. 1996లోనే ఎస్‌సీవో తెరపైకి వచ్చింది. సభ్యదేశాల మధ్య సరిహద్దు వివాదాల పరిష్కారానికి.. సరిహద్దుల వెంబడి పెరుగుతున్న చైనా-రష్యా దళాల మొహరింపును నియంత్రించడమే ప్రధాన లక్ష్యంగా... ఈ గ్రూప్ ఏర్పాటైంది. ఎస్‌సీవో అధికారిక భాషలు... చైనీస్, రష్యన్. వరుసగా... ద కౌన్సిల్ ఆఫ్ హెడ్స్ ఆఫ్ స్టేట్స్... ద కౌన్సిల్ ఆఫ్ హెడ్స్ ఆఫ్ గవర్నమెంట్.. ఎస్‌సీవో నిర్ణయాల్లో కీలక పాత్ర పోషిస్తాయి.**

ద్వైపాక్షిక చర్చలు, ఒప్పందాల ద్వారా... సరిహద్దు వివాదాల పరిష్కారం.. సరిహద్దుల్లో దళాల మొహరింపును నియంత్రించడం.. వంటివి ప్రధాన లక్ష్యాలుగా ఎస్‌సీవోను ఏర్పాటు చేయడం జరిగింది. ఇటీవలకాలంలో.. అది ప్రభావశీల అంతర్జాతీయ సంస్థగా రూపుదిద్దుకుంది.

### సభ్యదేశాలు:
చైనా, రష్యా, కిర్గిజిస్థాన్, కజకిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్

**పరిశీలక దేశాలు:** భారత్, పాకిస్థాన్, ఇరాన్, మంగోలియా

**చర్చల భాగస్వామ్య దేశాలు:** శ్రీలంక, బెలారస్

### సదస్సులు:
ప్రతిఏటా వేసవిలో సభ్యదేశాల అధ్యక్షుల సదస్సులు జరుగుతాయి. ఆ సందర్భంగా రాజకీయాలు, భద్రతా సంబంధిత అంశాలపై చర్చిస్తారు. ప్రధాన మంత్రుల సదస్సు మాత్రం ఆర్థికాంశాలపై దృష్టిసారిస్తుంది.

### ప్రాంతీయ ఆర్థిక సహకారం:
సభ్య దేశాల మధ్య బహుళ వాణిజ్య, ఆర్థిక సహకారం కోసం... ఎస్‌సీవో 2003లో ఒక ప్రత్యేక ప్రణాళికను రూపొందించింది. ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడుల పెంపునకు అత్యంత సానుకూల పరిస్థితులను కల్పించడం... ప్రాంతీయ వనరుల సమర్థ వినియోగం దీని ముఖ్య ఉద్దేశం. దాంతోపాటు వస్తువులు, సేవలు, డబ్బు, టెక్నాలజీ.. ఒక దేశం నుంచి మరో దేశానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా బదిలీ అయ్యేట్లు చూస్తారు.

### ఇంధనం, రవాణా:

మధ్య ఆసియా నుంచి చైనా వరకూ.. రష్యా నుంచి చైనా వరకూ... చమురు, గ్యాస్ ప్రాజెక్టులను అమలు చేసేందుకు ఎస్‌సీవో సభ్యదేశాలు ఒక బృహత్ ప్రణాళికను సిద్ధం చేసుకొని, అమలు చేయాలి.

### భౌగోళిక రాజకీయ ఏకీకరణ:

సరికొత్త భౌగోళిక రాజకీయ ఏకీకరణ మోడల్‌గా ఎస్‌సీవోను విశ్లేషకులు పేర్కొంటున్నారు. యూరేషియా ప్రధాన భూభాగంలో మూడింట రెండొంతులు ఈ గ్రూప్ పరిధిలోకి వస్తోంది. దాంతోపాటు ఆయా దేశాల విభిన్న నాగరికతల నేపథ్యం.. విభిన్న ప్రయోజనాలు.. ఈ అంతర్జాతీయ గ్రూప్ ప్రత్యేకతగా పేర్కొనవచ్చు.

### ఎస్‌సీవో... విస్తరణ ప్రణాళికలు:

- పరిశీలక దేశాల హోదాలో... భారత్, ఇరాన్, పాకిస్థాన్, మంగోలియాలను ఆహ్వానించాలని ఎస్‌సీవో రక్షణ మంత్రులు 2009, ఏప్రిల్‌లో నిర్ణయించారు. సంస్థ సైనిక కార్యకలాపాల్లో పాల్గొనాల్సిందిగా ఈ దేశాలను కోరారు. ఈ దేశాలను పరిశీలక హోదాలో ఆహ్వానించాలనే నిర్ణయం వెనుక రష్యా ప్రత్యేక కృషి ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. క్రమేణా వాటిని సభ్యదేశాలుగా చేర్చుకోవడమే ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోందంటున్నారు.
- పరిశీలక దేశాలైన భారత్, ఇరాన్, పాకిస్థాన్, మంగోలియాలతో తరచూ సంప్రదింపులు జరపాలని 2008, సెప్టెంబరులో జరిగిన దుషాన్బే సదస్సు నిర్ణయించింది. పరిశీలక దేశాలను ఎస్‌సీవో రీజనల్ యాంటీ- టెర్రరిస్ట్ స్ట్రక్చర్ (ఆర్‌ఏటీఎస్) తోపాటు రవాణా, వాణిజ్య సదస్సుల్లోనూ పాల్గొనేట్లు చూడాలని రష్యా అధ్యక్షుడు దిమిత్రి మెద్వెదేవ్ సూచించారు.
- వార్షిక సదస్సుల సందర్భంగా పరిశీలక దేశాల ప్రభుత్వాధినేతలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని ఎస్‌సీవో సభ్యదేశాల నేతలు నిర్ణయించారు.
- పరిశీలక దేశాలతో కలిసి పనిచేయడాన్ని మరింత వేగవంతం చేయాలని, వారి అభిప్రాయాలకు సముచిత స్థానం ఇవ్వాలని దుషాన్బే సదస్సు నిర్దేశించింది.
- కొత్తగా సభ్యత్వం కల్పించేందుకు వీలుగా మారటోరియంను ఎత్తివేసే దిశగా... ఆర్థిక, రాజకీయ, న్యాయ అంశాలను పరిశీలించేందుకు ఒక కార్యాచరణ బృందాన్ని ఏర్పాటు చేయాలని ఎస్‌సీవో సదస్సు నిర్ణయించింది.
- ఎస్‌సీవోను మరింతగా విస్తరించేందుకు వీలుగా పరిశీలక దేశాల హోదాతోపాటు కొన్ని దేశాలకు చర్చల భాగస్వామ్య హోదా కల్పించే అంశాన్ని పరిశీలించాలని కూడా దుషాన్బే సదస్సు నిర్ణయించింది. 2009, జూన్‌లో రష్యాలోని యాకెతిరిన్ బర్గ్‌లో జరిగిన సదస్సులో... శ్రీలంక, బెలారస్‌లకు చర్చల

భాగస్వామ్య హోదా కల్పించారు.

## నేపథ్యం:

- 2002, జూన్ 7న రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరిగిన సదస్సులో.. ఆరు దేశాల నేతలు షాంఘైకో ఆపరేషన్ ఆర్గనైజేషన్(ఎస్‌సీవో) ఛార్టర్‌పై సంతకాలు చేశారు. దాంతో ఎస్‌సీవో పూర్తిస్థాయి అంతర్జాతీయ సంస్థగా రూపుదిద్దుకుంది. ఇది ఏ ఇతర దేశానికి కాని, దేశాలకు కాని వ్యతిరేకంగా ఏర్పాటు కాలేదని... ఇది ఎలాంటి ప్రత్యేక కూటమి కానే కాదని ఛార్టర్‌లో స్పష్టం చేశారు.
- సభ్య దేశాలు రాజకీయ డిక్లరేషన్ పైన సంతకాలు చేశాయి. ప్రాంతీయ భద్రత, ఆర్థిక సహకారం, ఉగ్రవాదానికి వ్యతిరే కంగా పోరాడటం.. ముఖ్య లక్ష్యాలుగా నిర్ణయించారు. ఎస్‌సీవో సభ్య దేశాలు ఉగ్రవాదాన్ని తీవ్రంగా వ్యతిరేకించాయి.
- ఎస్‌సీవో పరిధిలో రష్యా, చైనాల మధ్య రక్షణ ఒప్పందం జరగనుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఎస్‌సీవో ఛార్టర్‌పై సంతకాలు రష్యా, చైనాల మధ్య రక్షణ ఒప్పందం దిశగా తొలి అడుగన్నారు. ఎస్‌సీవో సభ్యదేశాలైన కజికిస్థాన్, కిర్గిజిస్థాన్, తజికిస్థాన్.. ఇప్పటికే రష్యా నేతృత్వంలోని రక్షణ ఒప్పందంలో భాగస్వామ్య దేశాలు! మధ్య ఆసియాలో అమెరికా, నాటో సైనిక స్థావరాల ఏర్పాటుతోపాటు అమెరికా ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో... ఈ ప్రాంత భద్రత ఏర్పాట్లలో చైనా, రష్యా సంయుక్తంగా పాల్గొనేట్లు చేశాయి. సభ్యదేశాల ఉమ్మడి భద్రత కోసం ఎస్‌సీవో కృషి చేయాలని చైనా గట్టిగా కోరింది.

## యాకెతిరిన్‌బర్గ్ సదస్సు:

- రష్యాలోని యాకెతిరిన్‌బర్గ్‌లో.. 2009, జూన్ 15,16 తేదీల్లో.. ఎస్‌సీవో సదస్సు జరిగింది. ఈ సదస్సులోనే తొలిసారిగా భారత ప్రధాని మన్మోహన్ సింగ్ పాల్గొన్నారు. మధ్య ఆసియాలోని పొరుగుదేశాలతో సంబంధాలను మెరుగుపరచుకోవాలని భారత్ భావిస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఉగ్రవాదం, ఇంధన భద్రత, మౌలిక సదుపాయాలు, వ్యవసాయం, రవాణా, సైన్స్ అండ్ టెక్నాలజీ, విద్యా రంగాల్లో... ఎస్‌సీవో సభ్యదేశాలకు, భారత్‌కు మధ్య ఉమ్మడి ప్రయోజనాలున్నాయని మన్మోహన్ పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంక్షోభాన్ని ఒక అవకాశంగా మలుచుకునేందుకు వీలుగా సభ్యదేశాలకు, భారత్‌కు మధ్య లోతైన చర్చలు జరగాలని ఆయన అభిలషించారు.
- ఆర్థిక వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా... అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణల దిశగా... ఎస్‌సీవో, పరిశీలక దేశాలు సంయుక్తంగా కృషిచేయాలని మన్మోహన్ సూచించారు. ఇంధనం, రవాణా, తయారీ, వ్యవసాయ రంగాలకు సంబంధించి అభివృద్ధి చెందుతున్న దేశాలకు పర్యావరణ సానుకూల టెక్నాలజీ, ఆర్థిక వనరుల అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు. తన ఆర్థిక అభివృద్ధికి, ఆర్థిక లక్ష్యాల సాధనకు సరిహద్దుల్లో సుహృద్భావ వాతావరణం అసరమని భారత్ భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. గత

ఐదేళ్లుగా 8 శాతం వృద్ధిరేటును నమోదు చేసుకుంటున్న భారత్... మౌలిక సదుపాయాలు, సామాజిక రంగంలో పెట్టుబడులకు అవసరమైన వనరులను సమకూర్చుకోగలిగిందన్నారు.

## డిక్లరేషన్:

- ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని సంయుక్తంగా ఎదుర్కోవాలని... న్యాయబద్ధ అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ ఏర్పాటుకు కృషి చేయాలని షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీవో) ప్రకటన పేర్కొంది.
- న్యాయమైన, విశ్వవ్యాప్త అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ ఏర్పాటుకు సభ్య దేశాలు సంయుక్తంగా కృషి చేయాలని పేర్కొంది. ప్రపంచీకరణ ఫలాలు ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని అభిప్రాయపడింది.
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించేందుకు డాలర్‌తోపాటు అంతర్జాతీయ, ప్రాంతీయ కర్సెనీల రిజర్వ్‌ల ఏర్పాటుకు కృషి చేయాలని... చెల్లింపులు జాతీయ కర్సెనీల్లో జరిగేట్లు చూడాలనే ప్రతిపాదనలపై ఎస్‌సీవో నేతలు చర్చలు జరిపారని రష్యా అధ్యక్షుడు దిమిత్రి మెద్వెదేవ్ తెలిపారు.
- ప్రపంచ ఆర్థిక సంక్షోభం నివారణ దిశగా... సభ్య దేశాల్లో, పరిశీలక దేశాల్లో వాణిజ్యంతోపాటు పెట్టుబడులను పెంచాలని సదస్సు నిర్ణయించింది. రవాణా, పర్యాటకం, ఇంధన టెక్నాలజీ, మౌలిక వసతుల రంగాల్లో భారీ ప్రాజెక్టులను చేపట్టాల్సిన అవసరాన్ని సదస్సు గుర్తించింది.

## ముగింపు:

షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్(ఎస్‌సీవో)...140 కోట్ల మంది జనాభాతో... 30 మిలియన్ల చదరపు కిలోమీటర్ల భూభాగం కలిగి ఉంది. ప్రపంచ చమురు, గ్యాస్ నిక్షేపాల్లో ఎక్కువ శాతం ఈ ప్రాంతంలోనే ఉంది. ఐదు అణ్వాయుధ దేశాల్లో... రెండు ఇక్కడే ఉన్నాయి. ఇన్ని ప్రత్యేకతలు ఉండటంతో ఎస్‌సీవో అంతర్జాతీయంగా అత్యంత ప్రభావశీల సంస్థగా రూపుదిద్దుకుంటోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు!!

## భారత్... ఎస్‌సీవో:

ఎస్‌సీవోలో పరిశీలక దేశంగా భారత్ చేరడం... వ్యూహాత్మక, ఆర్థిక ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. భారత్ పరిశీలక దేశంగా చేరడం సభ్య దేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాలను మరింత మెరుగుపరుస్తుందని చైనా అధ్యక్షుడు హు జింటావో అభిప్రాయపడ్డారు. చైనా-భారత్ మధ్య ద్వైపాక్షిక సంబంధాల మెరుగుదలకు ఎస్‌సీవో ఒక వేదికగా పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రఖ్యాత 'సిల్క్ రూట్' కాలం నాటి పరిస్థితులను గుర్తుచేసేలా... భారత్, చైనా, రష్యా, ఇరాన్‌ల మధ్య సాంస్కృతిక, వ్యాపార, వాణిజ్య రంగాల్లో పరస్పర సంప్రదింపులు జరిగేలా ఎస్‌సీవో దోహదపడుతుందని భారత్ అభిప్రాయపడింది. ఎస్‌సీవో సభ్య దేశాలన్నీ ఉగ్రవాదం బెడదను ఎదుర్కొంటున్న నేపథ్యంలో.. ఈ

అంతర్జాతీయ వేదిక... పాకిస్థాన్‌పై ఒత్తిడి పెంచగలదని భావిస్తోంది. ఇంధన భద్రత కోణంలో కూడా ఎస్‌సీవో, భారత్‌కు అత్యంత కీలకం. ఎందుకంటే... భారత్ తన ఇంధన అవసరాల కోసం మధ్య ఆసియా దేశాలపైనే ఎక్కువగా ఆధారపడుతోంది.

### భారత్‌కు ముఖ్యమే:

2005లో పరిశీలక దేశంగా చేరినప్పటి నుంచీ దాదాపు అన్ని సదస్సులకు భారత్ హాజరవుతూ వస్తోందని విదేశాంగ కార్యదర్శి శివశంకర్ మీనన్ తెలిపారు. రష్యాలో ఎస్‌సీవో సదస్సుల సందర్భంగానే ప్రధాని మన్మోహన్ సింగ్, పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. రష్యా, చైనా, కజికిస్థాన్ దేశాల ప్రభుత్వాధి నేతలతోనూ మన్మోహన్ సమావేశమయ్యారు.

SAKSHI